www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 26 నవంబర్ 2023
5
తిరుపతి



దళితుల భూములపై పెద్దల కన్ను

సిపిఎం ఆధ్వర్యంలో సచివాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - ఓజిలి : దళితుల భూముల కోసం సిపిఎం ఆధ్వర్యంలో మాచవరం సచివాలయం ఎదుట ధర్నా చేయడం జరిగింది. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుంద, వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మండలంలోని మాచవరం గ్రామసర్వే నెంబర్ 207లో దళితులు, గిరిజన బలహీనవర్గాల పేదలకు శాశ్వత సాగు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1980 సంవత్సరంలో దళితులకు, బీసీలకు, డికెటి పట్టాలు, లీజు పట్టాలు ఇచ్చి ఉన్నారని వాటితో పాటు 9 నీటి బావులు కూడా మంజూరు చేసి ఉన్నారని తెలిపారు. పెత్తందారులు రాజకీయ పలుకుబడితో ఈ భూములను మేతపోరంబోకు భూములుగా మార్చివేశారని పేర్కొన్నారు. దళితులకు ఇచ్చిన భూముల్ని వారికి దక్కనివ్వకుండా పారిశ్రామికవేత్తలకు అమ్ముకునేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రస్తుతం పేదలని సాగు చేయనీయకుండా అడ్డుకుంటున్నారని, గ్రామంలో పదుల ఎకరాలను గ్రామ పెత్తందారులు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని వారి జోలికి వెళ్లకుండా, రెవెన్యూ, పోలీస్ అధికారులు దళితులకు పట్టాలిచ్చిన భూముల్లో నుంచి ఖాళీ చేయించడం అన్యాయమని తెలియజేశారు. దళితులు తమ పట్టా భూముల్లో సాగు చేసుకుంటున్నా నిమ్మచెట్లను ధ్వంసం చేయడం దుర్మార్గమని అన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం దళిత, గిరిజన బలహీన వర్గాల ఓట్ల కోసం నిలబడి తాయిలాలు పంచుతారని పేర్కొన్నారు. తమ బతుకులకు భద్రత కలిగించే భూమి అడిగితే మాత్రం హక్కు లేదని అంటున్నారని వాపోయారు. పరిశ్రమ అధిపతులకు మాత్రం పరుగులు తీసి వందలాది ఎకరాలు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్మెంట్ చట్టం ప్రకారం పేదలకు భూములను అప్పగించాలన్నారు. మాచవరం దళితులు, బలహీన వర్గాలు వారికి భూములు దక్కేంతవరకు సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందన్నారు. ఐద్వా నాయకులు చంద్రకళ మాట్లాడుతూ సాగు భూములు సాధించి సాగు చేసే వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్ని వర్గాల వారూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. గురవయ్య, పొండయ్య, విశ్వనాథ్, కిష్టయ్య సులోచనమ్మ మాచవరం గ్రామం దళితులు బలహీన వర్గాలు చెందిన 70 కుటుంబాలు వారు పాల్గొన్నారు.

సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, దళితులు

మోదీ హోదా ఏదీ..?

దశవాతారున్ని సాక్షిగా దశాబ్దం

ప్రజాశక్తి- తిరుపతి సిటి

విభజన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకునేందుకు ప్రత్యేక హోదా ఇస్తామన్న బిజెపి, ప్రధాని నరేంద్రమోదీ ఆ మాటను విస్మరించారు. దశావతారుడైన శ్రీవెంకటేశ్వరస్వామి పాదాలు సాక్షిగా ఇచ్చిన మాటకు దశాబ్దం అవుతున్నా అమలు చేసిన పాపాన పోలేదు. నేడు ఏ మోహం పెట్టుకుని తిరుపతికి వస్తున్నాడని సామాన్యుడు సూటిగా ప్రశ్నిస్తుండడం గమనార్హం.

అది 2014 దేశవ్యాప్తంగా సాధారణ ఎన్నికలు జరుగుతున్న రోజులు. అప్పటి హైదరాబాదు రాజధానికిగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విడగొట్టి. తెలంగాణ, విభజన ఆంధ్రప్రదేశ్‌గా మార్చింది. పార్లమెంట్ చీకటి గదుల్లో జరిగిన చట్టానికి అన్ని రాజకీయ పార్టీలు పరోక్షంగా, ప్రత్యేక్షంగా మద్దతు తెలిపిన వారే (ఒక సిపిఎం తప్పా). ఆ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు 5 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తున్నట్లు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంట్‌సాక్షిగా ప్రకటించారు. దీంతో పాటు మరెన్ని విభజన హామీలు ఇచ్చారు. అప్పడు రాష్ట్రానికి చెందిన టిడిపి, బిజెపి సైతం ప్రత్యేక హోదా 5 సంవత్సరాలు కాదు 10 సంవత్సరాలు కావాలని డిమాండు చేశాయి. ఈ నేపథ్యంలో సాధారణ ఎన్నికలో రానే వచ్చాయి. ఏపిలో భారతీయ జనతాపార్టీ, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు కలిసి పోటీకి దిగాయి. ఈ సందర్భంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి పేరుతో వెలిసిన శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం క్రీడామైదానంలో జరిగిన ఎన్నికల సభకు ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తిరుమల శ్రీవారిని దర్శించుకుని, తిరుపతికి చేరుకుని సభలో ప్రసంగిస్తూ తిరుమల శ్రీవారి పాదాల

సాక్షిగా త్రాను అధికారంలోకి వస్తే ఏపికి ప్రత్యేక ఇస్తానని హామీ ఇచ్చారు. అప్పడే ఆదే వేదికపై టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్ కూడా ఉన్నారు. క్యాలెండరు తిరగబడింది. 2019 ఎన్నికలు వచ్చేసరికి బిజెపిని జనసేనాని విమర్శించారు. తిరుపతి సాక్షిగా ఏపికి మోదీ పాసిపోయిన లడ్డులు ఇచ్చాడని ఎద్దేవా చేశారు. మమ్మల్ని బిజెపి మోసం చేసింది. ఆయనదన్ని అపద్దాల హామీలే అంటూ టిడిపి తూర్పార పట్టింది. మళ్లీ ఎన్నికల క్యాలెండరు మారింది. మరో కొన్ని నెలల్లో ఏపిలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పడు మళ్లీ కప్పదాటు చేస్తాలు తప్పడం లేదు. బిజెపిని పాసిన లడ్డులు అన్న పవన్ కల్యాణ్ అంటపెట్టుకున్ని, పొత్తు పెట్టుకున్నాడు. టిడిపితో సైతం బిజెపికి పొత్తు పెట్టుకునేలా అనేక చర్చలు జరుగుతున్న విషయం జగమెరిగిన సత్యం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తెలంగాణ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ఎన్నికల సభలో పాల్గొంటున్న ప్రదాని నరేంద్ర మోదీ పనిలో పనిగా ఆదివారం తిరుపతికి చేరుకుని, తిరుమల శ్రీవారిని దర్శించుకుని, తిరిగి తెలంగాణకు వెళ్లి ఎన్నికల సభల్లో పాల్గొంటారు. ఇదే తిరుపతికి సాక్షిగా నరేంద్రమోడి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీకి సుమారు దశాబ్దం అవుతోంది. హోదానే కాదు. ప్రత్యేక ఫ్యాకేజీ, రాయలసీమకు, వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతాలకు నిధులు ఇవ్వలేదు. జాతీయ ప్రాజెక్టుగా చెప్పతున్న పోలవరానికి నిధులు కూడా అంతంత మాత్రమే. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదు. విశాఖ రైల్వే డివిజన్ లేదు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు లేవు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి సహయం లేదు. అంతెందుకు ఏడాదికి లోటుగా ఉంటున్న 16వేల కోట్ల రూపాయలలో సైతం పైసా ఇచ్చిన దాఖలాలు లేవు. విభజన హామీలన్ని నీటి మూటలయ్యాయి. దీనికి తోడు కొత్తగా ఏమి ఇవ్వకపోగా ఆంధ్రరాష్ట్రానికే తలమానికమైన విశాఖ ఉక్కును సైతం కార్పొరేట్ శక్తులకు అప్పగించారు. ప్రభుత్వరంగ సంస్థలను (రైల్వే, ఎల్ఐసి, బ్యాంకులు, విమానశ్రయాలు, పోర్టులు) ప్రయివేట్ వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారు. ఇదేమని ఆడిగే నాథుడే లేదు. అధికారంలో ఉన్న వైసిపి, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి, మిత్రపక్షమైన జనసేన ముగ్గురు ముగ్గురే. మోదీకి మోకరెల్లడంలో ఎవ్వరికి వారు పోటీ పడుతూనే ఉన్నారు. ఇక ప్రశ్నించే దిక్కేది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే స్థితి ఏది. తిరుపతి సాక్షిగా ప్రత్యేకహోదా ఇచ్చిన నరేంద్ర మోదీ దశాబ్దాం తర్వాత శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి ఆదివారం తిరుపతికి రానున్న సందర్భంగా తిరుపతి వాసులు, ఆంధ్ర ప్రజలు తమకు ఇచ్చాన హామీలను అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ఎన్నికల రాజకీయాలు మానీ, ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, రానున్న ఎన్నికల సమయంలోపు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ప్రకటించాలని, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, విభజన హామీలను ఖచ్చితంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటిలిజెన్స్ డీఎస్పీ హఠాన్మరణం

నడకదారిలో ఘటన

డిఎస్పీ కృపాకర్ మృతదేహం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో ఇంటెలిజెన్స్ డిఎస్పీ కపాకర్ హఠాన్మరణం చెందారు. మెట్ల దారిలో వెళుతుండగా గుండెపోటుకు గుర్తై కుప్ప కూలారు. ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే కన్నుమూశారు. 26,27 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోడీ తిరుమల పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు శనివారం కపాకర్ తిరుమల చేరుకున్నారు. మెట్లదారిలో సెక్యూరిటీ ఏర్పాట్లు పర్యవేక్షించడంతో పాటు శ్రీవారిని దర్శించుకోవాలని భావించారు. మెట్ల దారి గుండా పైకి వెళుతుండగా 1,805 మెట్టు దగ్గర అస్వస్థతకు గురయ్యారు. గుండెలో నొప్పితో కుప్పకూలారు. డీఎస్పీ కపాకర్ వయస్సు 59 సంవత్సరాలు.. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ దగ్గర్లోని పోరంకి రూరల్ కపాకర్ మరణవార్తను ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

ప్రాంతీయ వైద్యశాలలో క్యాంటీన్ ప్రారంభించండి

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో క్యాంటీన్ వెంటనే ప్రారంభించాలని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి హరీష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను ప్రతినిధుల బందం శనివారం ప్రాంతీయ వైద్యశాఖ పర్యవేక్షకులు డాక్టర్ విజయలక్ష్మిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో క్యాంటీన్ నిర్మాణం పూర్తయి ఐదు నెలలు దాటుతోందన్నారు. అయినా దానిని ప్రారంభించడానికి వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు. క్యాంటీన్ అందుబాటులో లేకపోవడంతో వైద్యశాలకు వచ్చే రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని హరీష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యశాల ఆవరణలో క్యాంటీన్ అందుబాటులో లేకపోవడం వలన రోగులు బయట హోటళ్లను ఆశ్రయించవలసి వస్తోందన్నారు. బయట హోటళ్లలో ధరలు విపరీతంగా ఉండటంతో పేదరోగులు భారం మోయలేక పోతున్నారన్నారు. పేదరోగుల సమస్యలను దష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా క్యాంటీన్ ప్రారంభించాలని హరీష్‌రెడ్డి కోరారు. ఈ సమస్య శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి దష్టికి కూడా తీసుకెళతామన్నారు. ఈసందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వీలైనంత త్వరగా వైద్యశాల ఆవరణలో క్యాంటీన్ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను డిప్యూటీ ఛైర్మన్ యల్లంపాటి కోటేశ్వరబాబు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో తిరుపతి యస్‌వి. యూనివర్శిటి క్యాంపస్‌లో శనివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరంను విజయవంతంగా నిర్వహించారు. సునీల్ ప్రసాద్, యండబ్ల్యూట, అడ్జటెంట్ అభ్యర్ధన మేరకు నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంనకు తిరుపతి యస్‌వి యూనివర్శిటి క్యాంపస్ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలను స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి కుమార్ అభినందించారు. స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంక్ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొని ఉచిత బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు, స్వచ్ఛంద రక్తదాన సేకరణ చేశారు. డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ రవికాంత్, డాక్టర్ జీవన్, నర్సింగ్ సిబ్బంది కె.రమాదేవి, చాముండేశ్వరి, టెక్నిషియన్లు వై.వరలక్ష్మీ, ఎన్.అనిత, బి.గీత, కె.శ్రీదేవి, ఎంఎల్‌టి విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ కేంద్రాల పరిశీలన

వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రూప మిశ్రా

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్త నిర్వహణ కేంద్రాన్ని స్వచ్ఛ భారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూప మిశ్రా, కమిషనర్ హరిత, అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైవేస్ట్ రికవరి ప్లాంట్‌ను, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేసే ప్లాంట్‌ను అదేవిధంగా బయోమిథన్ గ్యాస్ ప్లాంట్ పనిచేసే విధానాన్ని కమిషనర్ క్షుణ్ణంగా వివరించారు. నగరంలో ప్రతి ఇంటి నుండి, హోటల్స్, దుకాణాల, హాస్పిటల్స్ నుంచి మూడు రకాలుగా చెత్తసేకరణ చేస్తున్నామని తెలిపారు. ఆ చెత్తను ఆటోల ద్వారా నగరంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలిస్తామని తెలిపారు. అక్కడ నుండి పెద్ద టాంకర్ల సిఏపిఎస్‌యుఎల్‌ఈఎస్ ద్వారా తూకివాకం తరలించి నిర్వహణ చేస్తామని వివరించారు. బయో మిథనైజేషన్ ప్లాంట్ నుండి సిఎన్‌జి గ్యాస్ ఉత్పత్తి చేసే విధానాన్ని వివరించారు. ఈసందర్భంగా జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న చెత్తనిర్వహణ చాలా బాగుందన్నారు. చెత్తసేకరణ విధానం కూడా బాగుందని, మరింత మెరుగ్గా చేస్తే చెత్త నిర్వహణలో దేశంలోనే తిరుపతి నగరపాలక సంస్థ ఆదర్శనీయంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ విజయకుమార్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నాయుడుపేటలో యుటిఎఫ్ సమావేశం

ప్రజాశక్తి- రేణిగుంట: మండల యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం శనివారం రేణిగుంట మెయిన్ స్కూల్‌లో జరిగింది. ఈసమావేశంలో యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. మండల గౌరవాధ్యక్షులుగా ఎం.వెంకటస్వామి, అధ్యక్షులుగా శశికళ, సహాధ్యక్షులుగా కె.మీన, ఎం.లోకనాథం, ప్రధాన కార్యదర్శిగా అద్దంకి మురళి, కోశాధికారిగా కె.మురళీధర్, జిల్లా కౌన్సిలర్లుగా కె.చంద్రశేఖర్, చిట్టిబాబు, వరదారెడ్డి, పి.సుబ్రహ్మణ్యం, అల్లాబక్షు, పరంధామరెడ్డి, మురళిగోపిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా కమిటీ కన్వీనర్‌గా రోజా, కోకన్వీనర్‌గా పద్మావతమ్మ, సిపిఎస్ కన్వీనర్‌గా పుణ్యప్రసాద్, కో-కన్వీనర్‌గా కౌసల్య, ఐఖ్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్‌గా సత్యం, మండల ఆడిట్ కమిటీ మెంబర్‌గా వెంకట సుబ్బయ్యలను ఎన్నుకోవడం జరిగింది. అలాగే మండల కార్యదర్శులుగా పెంచలస్వామి, దీప, గురుప్రసాద్, పురుషోత్తం, మునిరెడ్డి, హరిణిలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ఎన్నికల పరిశీలకులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల, అబ్జర్వర్‌గా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జిజే. రాజశేఖర్, జిల్లా కార్యదర్శి దండు రామచంద్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974లో ఏర్పడిన యుటిఎఫ్ సంఘం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఈరోజు ఉపాధ్యాయ లోకానికి నెంబర్‌వన్ సంఘంగా కొనసాగుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షకు పైగా సభ్యత్వం కలిగి ఉండడం హర్షణీయమని పేర్కొన్నారు. మనం ప్రభుత్వాల నుంచి ఏమి సాధించాలన్న ఉద్యమాలు, పోరాటాల ద్వారా మాత్రమే సాధించగలమని, ప్రభుత్వాలు ఏమి ఉద్యోగులకు ఊరికే ఇవ్వవని, భవిష్యత్తులో ఉద్యోగ ఉపాధ్యాయులు మరిన్ని పోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులుగా తమ కోరికలు ఏవి అడిగినా మనకి నోటీసులు ఇవ్వడం, అరెస్టులు చేయడం, కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం ఈప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. వీటన్నిటికీ భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తెలియజేశారు. నిజాయితీ, నిబద్ధత, ఐక్యత, ఎటువంటి ప్రలోభాలకు లొంగని ఏకైక సంఘం రాష్ట్రంలో యుటిఎఫ్ మాత్రమేనని అన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు యుటిఎఫ్ నియమ నిబంధనలకు కట్టుబడి, సంఘం బలోపేతానికి కషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

నాయుడుపేట : మండల యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం స్థానిక బ్రాహ్మణవీధిలోని యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. మండల గౌరవాధ్యక్షులుగా జి.శంకరయ్య, అధ్యక్షులుగా కె.సుబ్బారావు, సహాధ్యక్షులుగా డి.సావిత్రి రెండవ సహాధ్యక్షులుగా ఎం.రమేష్ ప్రధాన కార్యదర్శిగా టి.గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా ఓ.సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా కమిటీ కన్వీనర్‌గా ఎన్.స్నేహలతని ఎన్నుకోవడం జరిగింది. ఈసమావేశానికి ఎన్నికల పరిశీలకులుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జిజే.రాజశేఖర్, అబ్జర్వర్‌గా యుటిఎఫ్ రాష్ట్రకౌన్సిలర్ ఎం.రామ్మూర్తిరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.శేఖర్, జిల్లా కార్యదర్శి హరిబాబు హాజరయ్యారు.

తిరుమల చేరుకున్న కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-తిరుమల: కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ శనివారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. జీఎంఆర్ విశ్రాంతి గృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి, టీటీడీ ఈవో ఏ.వీ ధర్మారెడ్డి ఘనస్వాగతం పలికారు. కేంద్ర మంత్రి ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకుంటారని ఈఓ తెలిపారు.

సమ్మెకు సిద్ధమైన అంగన్వాడీలు

ప్రజాశక్తి- చిల్లకూరు

డిటికి సమ్మె నోటీసును అందజేస్తున్న అంగన్వాడీలు

మండల కేంద్రమైన చిల్లకూరు డిప్యూటీ తహశీల్దార్ మస్తానయ్యకు చిల్లకూరు మండల సిఐటియు నాయకులు అంగన్వాడీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇందిరమ్మ, ప్రభావతి ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందించడం జరిగింది. శనివారం డిప్యూటీ తహశీల్దార్‌కు సమ్మె నోటీసు అందజేసిన తర్వాత డిమాండ్లను తెలియజేశారు. జీతాలు పెంపు, గ్రాడ్యుయేట్స్‌కు పెన్షన్లు, రిటైర్ అయిన ఉద్యోగస్తులకు రూ.5లక్షల, ఆయాలకు రూ.2లక్షలు, తెలంగాణ కంటే ఆంధ్రాలో అంగన్వాడీ కార్యకర్తలకు వెయ్యి రూపాయలు అదనంగా జీతాలు చెల్లిస్తామని జగనన్న హామీ ఇచ్చిన మాట అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకు హామీలు అమలయ్యేనా..?

సమ్మెకు సన్నద్ధమవుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- తిరుపతి సిటి:

అంగన్‌వాడీలు లేని ఊరు లేదు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలైన దాఖలాలు లేవు. పసిపిల్లలు, గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, వారి ఆరోగ్యంపై శ్రద్ద చూపడం, పిల్లల ఆలనా పాలన చూపడంలో అంగన్‌వాడీ వర్కర్ల సేవలు కీలకం. కానీ నిత్యం సమస్యలతో సతమతమవడం షరామామూలే. కనీస వేతనాలు కూడా ఇవ్వని పరిస్తితి. ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా వీరి పరిస్థితులు మాత్రం మారలేదు. నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు, వంటావార్పులు చేసిన ఫలితం శూన్యం. విధిలేని పరిస్థితుల్లో సమ్మె బాటపట్టేందుకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మెబాట పట్టనుండడం గమనార్హం.

ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఐఎస్ఐ గ్రాట్యూటి అమలు తదితర వాటిపై అంగన్‌వాడీలు సంవత్సరాల తరబడి పోరాడుతూనే ఉన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలైన అంగన్‌వాడీల సమస్యలు పరిస్కారం చెయ్యలేదు. పైగా ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్దంగా సెంటర్లు కుదించడానికి నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చింది. ఇటీవల కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను అనేక రెట్లు పెరిగాయి. కానీ ధరలకు అనుగుణంగా వేతనాలు నయాపైసా కూడా పెంచలేదు. అంగన్‌వాడీల పోరాటాల ఫలితంగా 2018లో వర్కర్లకు 1500, హెల్పర్‌కు రూ.750, మినీ వర్కర్‌కు రూ.1250లు పెంచుతున్నామని ప్రకటన చేసిన ఇంతవరకు అమలు చేయ్యలేదు. 2017 నుంచి టిఎ బిల్లులు ఇవ్వడం లేదు. 2022 ఏప్రిల్ 25 అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు 1972 చట్టం ప్రకారం గ్రాట్యూటికి అర్హులని తెలియజేసింది. కానీ అంగన్‌వాడీలకు గ్రాట్యూటి

ప్రజాదృష్టి

ఇప్పటి వరకు అమలు చేయ్యలేదు. లబ్ధిదారులను కుదించడానికి పోషణ ట్రాక్‌యాప్‌ను తీసుకొచ్చింది. ప్రైవేటీకరణ విధానంలో భాగంగా రకరకాల యాప్‌లు తెచ్చి వారిపై పనిభారం పెంచారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2023-24వ సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్ వల్ల 26లక్షల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లతో పాటు కోటి మందిగా ఉన్న స్కీం వర్కర్లకు ప్రయోజనం కలగలేదు. ఐసిడిఎస్‌కి నామమాత్రంగా రూ.291.24 కోటు బడ్జెట్ పెంచినప్పటికి పెరుగుతున్న ధరలతో ఇది ఏ మాత్రం సరిపోదు. గత 48 సంవత్సరాల నుంచి గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు కనీసం ఉద్యోగ భద్రత కల్పించలేదు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పరిస్థితి అంతే. అంగన్‌వాడీలకు తెలంగాణా కన్న అదనంగా వేతనాలు పెంచుతానన్న ముఖ్యమంత్రి హామీ నీటి మీద రాతగా మిగిలింది. సెంటర్ల నిర్వహణకు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి అంగన్‌వాడీలు నెట్టబడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమీషనర్, ఎంఎస్‌కె, ఎంఆర్‌ఓ, ఎండివో, రాజకీయ నాయకులు ఇలా అనేక మంది విజిట్ల పేరుతో అంగన్‌వాడీలను అవమానిస్తూ, వేధింపులకు గురి చేయడం నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉంది. ఇలాంటి అనేక సమస్యల నడుము అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఇబ్బందులు పడుతూనే, తమ సేవలను అందిస్తున్నారు. పాలకులు తీరులో మార్పు మాత్రం రావడం లేదు. అనేక ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, వంటావార్పులు చేసిన ఫలితం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో డిసెంరు 8 నుంచి నిరవాధిక సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో సభలు, సమావేశాలు పెట్టి, అందరిలో చైతన్యం తీసుకొస్తున్నారు. అందులో భాగంగా రెండు రోజుల క్రితం అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ అధ్యక్షతన తిరుపతిలో జిల్లాస్థాయిలో అంగన్‌వాడీ యూనియన్ల రౌండ్‌టేబుల్ నిర్వహించారు. దీనికి సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్.నరసింగరావు ముఖ్యఅతిథిగా హాజరై అంగన్‌వాడీ పోరాటాలకు మద్దతు తెలియజేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి, అంగన్‌వాడీలను ఆదుకుని, వారి న్యాయమైన డిమాండ్లను పరిస్కరించి, సమ్మెకు వెళ్లనీయకుండా నిలవరిస్తారని ఆశీద్దాం.

దేవరాజ్ మొదలియార్‌కు మంత్రి నివాళి

దేవరాజ్ మొదలియార్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని గేట్ పుత్తూరు ఎనిమిదవ వార్డుకు చెందిన వైసిపి నాయకులు దేవరాజులు మొదలియార్ అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కె రోజా పుత్తూరులో ఉంటున్న పుత్తూరు మొదలియార్ మక్కల్ నాలసంఘం అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకులు దేవరాజ్ మొదలియార్ ఇంటికెళ్లి భౌతిక కాయానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డి శంకర్, పుత్తూరు మున్సిపాలిటీ వైసిపి కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఎక్స్మార్ట్ సమీపంలో వర్షపు నీరు తొలగింపు

ప్రజాశక్తి - కోట: కోట పట్టణంలోని ఎక్స్మార్ట్ సమీపంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని జెసిబి సాయం తో రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు. ఆర్అండ్‌బి రోడ్డుపై నిరంతరం వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండడానికి తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులను నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉండడానికి ఈ మరమ్మతు పనులు చేపట్టున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి అధి కారులు ఏఈ శివయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ పఠ్రి బాలకృష్ణ, మీజూరు మల్లికార్జున రావు పాల్గొన్నారు.

వర్షపు నీటి తొలగింపు పనులు పరిశీలిస్తున్న వైసిపి నాయకులు నల్లపరెడ్డి వినోద్‌కుమార్

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కేవీబీపురం: కెవిబి పురం మండలంలో యుటిఎఫ్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్నికల అధికారి జి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా కె. దామోదరం రెడ్డి, అధ్యక్షులుగా ఏ హేమాంబరధర రావు, ప్రధాన కార్యదర్శిగా వై పురుషోత్తం, కోశాధికారిగా బి మునెయ్య, జిల్లా కౌన్సిలర్లుగా ఎం దామోదరంశెట్టి, కె శ్రీదేవి, ఎ వేమయ్య, యు అశోక్, వి నరసింహులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు హేమాంబరధర రావు మాట్లాడుతూ సిపిఎస్‌ను వెంటనే రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. ఉపాధ్యాయులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని తెలిపారు.

కళాశాల అధ్యక్షుని మృతికి సంతాపం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల అధ్యక్షులు అల్లా రెడ్డి రవికుమార్ రెడ్డి మృతి చెందారు. ఆయన మృతికి సంతాపంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థినులు శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం కళాశాలకు సెలవు ప్రకటించారు. ఈ సంతాప సభలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రవికుమార్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

అదనపు గదులు ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఉన్న బ్రాహ్మణ భవనంలో నూతనంగా అదనపు భవనాలను నిర్మించారు. శనివారం గదులను లాయర్ పత్రికా సంపాదకులు తుంగా శివప్రభాత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం పలువురు దాతలను సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గూడూరు అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ బ్రాహ్మణులు ఈ భకర్తాలు, ఫంక్షన్లు నిర్వహించేందుకు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ జనార్ధన్ రెడ్డి రోహిణి, ఇంకా పలువురు దాతల సహకారంతో బ్రాహ్మణ భవనం మూడు సంవత్సరాల క్రితం నిర్మించిందని తెలిపారు. ఇప్పుడు నూతనంగా అదనపు గదులను ఏర్పాటు చేశారని బ్రాహ్మణులు ఈ భవనాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, పురుషోత్తం, వెంకటసుబ్బయ్య,ఎస్ఎల్ఎన్ స్వామి, లలిత పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఏర్పేడు : రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిరుపేదలు ఎవరు చనిపోయినా వారికి ఎమ్మెల్యే పది వేల రూపాయలు అందిస్తున్నారు. అందులో భాగంగా ఏర్పేడు మండలం కందాడు గ్రామానికి చెందిన బి భాస్కర్ శివకుమార్ రెడ్డి దారిలో గుండె పోటుతో గురువారం రాత్రి మరణించారు. ఆ గ్రామ సర్పంచ్ శ్రీదేవి భర్త రాఘవరెడ్డి ద్వారా ఆకస్మికంగా మృతి చెందారని విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పేడు మండలం వైసిపి ఇన్‌ఛార్జి గున్నేరి కిషోర్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం 10వేల రూపాయలను అందించారు. వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాంబత్తయ్య యాదవ్, మహేష్‌రెడ్డి నాగరాజు, కమలాకర్, గ్రామ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోర్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కోర్ సంస్థ ప్రతినిధి తులసి

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో కోర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. కోర్ సంస్థ ప్రతి నిధులు తులసి మాట్లాడుతూ ముఖ్యంగా సురక్షిత కాని లైంగిక సంబంధాల వల్ల, పరీక్ష చేయని రక్త మార్పిడి, శుభ్రపరచని ఇంజక్షన్లు, సిరంజిలు వల్ల హెచ్‌ఐవి ఉన్న తల్లి నుండి బిడ్డకు ఎయిడ్స్ సంక్రమిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్ సంస్థ ప్రతినిధి సుమలత, విజయ లక్ష్మి, పాఠశాల సిబ్బంది, మెడికల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైపి నీడ్స్ జగన్ ప్రోగ్రాం ఐపాక్ టీం తనిఖీ

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మండలం పాలెం కోట సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం వైసిపి మండల అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రోగ్రాం ని వైసిపి ఐప్యాక్ టీం పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రజల వద్దకు పాలనలో ఏ విధంగా ప్రజల వద్దే వారిని వివరించాలని సూచించారు. ప్రభుత్వ ప్రతిబింబించి ఈ కార్యక్రమాన్ని ప్రజల వద్దకు వెళ్ళి వాలంటీర్లు నాయకులు జోలె సంచెని తగిలించుకుని లోపలి పెట్టుకుని 2024లో మళ్లీ జగన్మోహన్ రెడ్డి ఎందుకు కావాలో వారికి అవగాహన కల్పించారు.

మహిళలపై హింసను నిర్మూలించాలి

ప్రజాశక్తి- క్యాంపస్ : మహిళలపై హింసను నిర్మూలించాలని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం, మహిళా అధ్యయన విభాగం, సెంటర్ ఫర్ ఉమెన్ సేఫ్టీ సంయుక్త ఆధ్వర్యంలో సెట్విన్ తిరుపతి, డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీస్ వారి సహకారంతో శనివారం మధ్యాహ్నం విశ్వవిద్యాలయ హ్యూమానిటీస్ బ్లాక్ సెమినార్ హాల్ లో అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సెట్విన్ తిరుపతి డిపార్టుమెంట్ ఆఫ్ యూత్ సర్వీస్ మేనేజర్ మోహన్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు కుటుంబం సమాజం పనిచేసే చోట అత్యాచారాలు,లైంగిక వేధింపులు దాడులు మొదలైన హింసను ఎదుర్కొం టున్నారని, బాలికలు, మహిళలపై రోజురోజుకీ హింస పెరిగిపోతూ ఉండడం బాధాకరమని వీటిని నిర్మూలిం చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సెంటర్ ఫర్ విమెన్ సేఫ్టీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీతాకుమారి మాట్లాడుతూ మహిళలపై హింస పెరిగిపోతూ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర, విభాగ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తెల్ల రిబ్బన్స్ ధరించి మహిళలపై హింస నిర్మూలనకై వారి నిబద్ధతను తెలిపారు.

కులగణన దేశానికే ఆదర్శం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ప్రతి కులానికీ ప్రాధాన్యం కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, తిరుపతి జిల్లా సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం అభిప్రాయపడ్డారు. శనివారం పిచ్చాటురు మండల కేంద్రంలోని పంచాయతీ పరిధిలో గల శేషంపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి ప్రతి గడపలో ఆత్మీయ స్వాగతం లభించింది. ప్రజాప్రతినిధులు, అధికారుల నడుమ ఎమ్మెల్యే గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ అవి సకాలంలో అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. సంక్షేమ బావుటా బుక్లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం స్థానిక మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు కే చలపతి రాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, వైసిపి మండల పార్టీ ఉపాధ్యక్షుడు రమేష్ రాజు సుబ్రమణ్యం రెడ్డి, తహశీల్దార్ మధుసూదన్ రావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, తొప్పయ్య , ఎంపిటిసి శోభన్ బాబు, కే వెంకటేశ్వర్లు, మోహన్ పాల పద్మనాభం కిరణ్ కుమార్ బాబు రెడ్డి ప్రజాప్రతినిధులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సెరికల్చర్ విభాగం మమతకు దుబాయ్ వర్సిటీ ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : బిట్స్ పిలాని దుబాయ్ క్యాంపస్ లో జరగబోయే మూడవ అంతర్జాతీయ సదస్సు "ఎన్విరాన్మెంటల్ సస్టైనబులిటీ న్యూ ప్యారడైమ్స్ అండ్ డెవలప్మెంట్ " అనే అంశంపై నవంబర్ 27 నుంచి 29 వరకు జరగబోవు సదస్సులో ఇన్వైటెడ్ స్పీకర్ ఆచార్య డిఎం మమతకి పిలుపు వచ్చింది. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో సెరికల్చర్ విభాగపు ఆచార్యులైన ఆచార్య డిఎం. మమత విశ్వవిద్యాలయం పూర్వపు రిజిస్ట్రార్ గా దాదాపు 6 సంవత్సరాలు సమర్థవంతంగా చేశారు. ఈ సదస్సుకు ఆమెను ఇన్వైటెడ్ స్పీకర్ గా పిలుపు రావడంతో ఆమె 26వ తేదీ ఇండియా నుంచి దుబాయ్ కి బయలుదేరుతున్నారు. ఈ సందర్భంగా పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థు లు శుభాకాంక్షలు తెలిపారు.

ఒప్పంద ఉద్యోగుల సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: విద్యాశాఖ సర్వ శిక్షా అభియాన్‌లో ఒప్పంద పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులు క్రమబద్ధీకరించాలని మండల విద్యాశాఖ అధికారులు వై సత్యనారాయణ, బి గోపీనాథ్‌లకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించక పోతే డిసెంబర్ 15వతేదీ నుంచి 19వ తేదీవరకు పెన్ డౌన్, 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ హేమంత్ , కంప్యూటర్ ఆపరేటర్ రాధ మెసెంజర్స్ స్టేట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పాటూరి రవి, సిఆర్ఎంటి లు శ్రీరాములు, ప్రవీణ్, మధు, ఐఈఆర్టీస్ వెంకట్రమణ, రమణయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికులా పని చేయాలి: నేదురుమల్లి

ప్రజాశక్తి -వెంకటగిరి : రాష్ట్ర భవిష్యత్తుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త రామ్ కుమార్ రెడ్డి అన్నారు. 11 12 వార్డుల 6వ సచివాలయం మల్లం గుడి దగ్గర వై ఎ పి నీడ్స్ జగన్ ప్రోగ్రాంలో రామ్ కుమార్ రెడ్డి వైసిపి జెండాను శనివారం ఆవిష్క రించారు. జగన్ సంక్షేమ పథకాలను ప్రతి వైసిపి నాయ కుడు, కార్యకర్త ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ సమన్వయకర్త గుమ్మల్లపు ఢిల్లీ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ శాతరాసి బాలయ్య, కౌన్సిలర్లు తంబ సుకన్య, గోపాలకృష్ణ, కందాటికళ్యాణి పాల్గొ న్నారు.

విద్యార్థులకు. ప్లేట్లు గ్లాసులు వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ పరిధిలో గల బొజ్జనత్తం.మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దాత ఎస్.ఆనంద్ సహకారంతో పేద విద్యార్థులకు.పాఠశాలలో చదువుతున్న పిల్ల లందరికీ భోజనం ప్లేట్లు దాత చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా దాత ఎస్ ఆనంద్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అది చూడలేక ఇవి వితరణ చేశామన్నారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. భారతి, ఉపాధ్యాయులు ఎ. కేశవులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్. శాంతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్కాట్ కష్ణప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్థానిక అనంతవీధి కార్యాలయంలో బిఆర్ఎస్ నేత, లయన్స్ క్లబ్ అధ్యక్షులు, కాపు నాయకులు ఆర్కాట్ కష్ణప్రసాద్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, బలిజ సంఘనాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ తన పుట్టినరోజును గుర్తుపెట్టుకొని శుభాకాంక్షలు తెలియజేసిన వారందరికీ కతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం గజమాలతో సత్కరించి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. బిఆర్ఎస్ నాయకులు బెల్లంకొండ సురేష్, ప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ నాయకులు గోపిప్రసాద్, రామ్మూర్తి, శ్రీరాములు, లయన్స్ క్లబ్ సభ్యులు జగన్నాథం, రఘు, రామారావు, నామ రాజేష్, సాయి పాల్గొన్నారు.

బాలికల పట్ల అసమానతలు తొలగింపునకు కృషి చేయాలి: ఏపిఎం

ఏపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పాకాల: సమాజంలో మహిళల పట్ల చిన్నచూపు చూడడం బాలికలను సమానంగా పెంచకపోవడం, ఈ అసమానతలు తొలగించేం దుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాకాల వెలుగు ఏపీఎం కోమలాదేవి అన్నారు. మండ లంలోని వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం మహిళల పట్ల చిన్నచూపు- జండర్ భేదం అనే విషయంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయం వద్ద మహిళ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం కొమలాదేవి మాట్లాడుతూ సమాజంలో బాలిక అంటే చిన్న చూపు ఉందని గర్భంలోనే వారిని తొలగించుకునే ప్రయత్నం చేస్తున్నారని గృహహింస వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని వాటిని కలసి కట్టుగా ఎదుర్కో వాలన్నారు. అనంతతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు అధి కారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: మండల కేంద్రంలోని వెలుగు మండలం మహిళా కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మొదట గ్రామీణ అభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి గిరి రాజ్ సింగ్ మన దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్త మహిళా మండల సమైక్యలు నిర్వహిస్తున్న కార్యాలయాల్లో మహిళలకు టెలివిజన్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి మండలం ఏపిఎం మునెయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఒక మాసం రోజులు కొనసాగుతుందని తెలిపారు. మొదటి వారం జెండర్ ఆధారిత హింస, రెండవ వారం బాల్య వివాహాలు, మూడవవారం రక్తహీనత, నాలుగవ వారం ఆడపిల్లలకు విద్యకు సంబంధించిన అంశాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తారని తెలిపారు. దీని ద్వారా స్త్రీలలో భయం, వివక్షత వంటి వి తొలగిపోతాయ న్నా రు. ఈ కార్యక్రమం లో శ్రీకాళహస్తి మండ ల వెలుగు కేంద్రం సిబ్బంది, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో మాట్లాడుతున్న ఎపిఎం మునెయ్య

ప్రజాశక్తి - ఓజిలి : జెండర్ ఆధారిత హింసను విడనాడాలని శనివారం స్త్రీ శక్తి భవనంలో ఎంపీడీవో వీ.రజినీకాంత్, డిప్యూటీ తహశీల్దార్ ప్రియాంక , ఏపీఎం నిర్మల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.మహిళలు చట్టలపై అవగాహన కలిగి ఉండాలని అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్న, ఏఎన్ఎంలు, ఉపాధి హామీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

తిరుపతి (మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మహిళల మీద హింస నిరోధక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విన్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు ఆర్.మీరా,

తిరుపతి శ్రీరామ ఇంజినీరింగు కళాశాలలో..

న్యాయవాది కె. శ్రావణి హాజరై విలువైన సందేశాన్ని అందించారు. నేడు సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు అమానుషమన్నారు. ప్రతి ఒక్కరూ వాటికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళల మీద దాడి చేస్తున్న ప్రతి ఒక్కరికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని, అందుకు చట్టంలో చాలా సెక్షన్స్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, ఉమెన్ ఎంపవర్మెంట్, ఉమెన్ ప్రొటెక్షన్, జాతీయ సేవ విభాగం నిర్వాహకులు చంద్రకళ, గ్రీష్మ, యెస్.చక్రిశ్రీధర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలాయపల్లి : మహిళా హక్కులు కాలరాస్తున్నారని క్రాంతి పథకం ఏపీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం వెలుగు పథకం ద్వారా మహిళ హక్కుల పరిరక్షణపై మానవహారంతో ర్యాలీ చేశారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మహిళ లపై ఆకృత్యాలు ఎక్కువయ్యాయని, మహిళా హక్కులు కాలరాయబడుతున్నాయన్నారు. మహి ళలపై రోజురోజుకూ హింస, లైంగికదాడులు, అత్యాచారాలు పెరిగాయన్నారు. దేశంలో మహి ళలపై పెద్ద సంఘటన జరిగినప్పుడే ప్రభుత్వాలు మేలుకొని చట్టాన్ని రూపొందించి వదిలే స్తున్నా యన్నారు. బేటీ బచావో, బేటీ పడావో అని చెప్పు మరోపక్క నేరగాళ్లకే కొమ్ము కాస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు,ఇంద్ర,విఓలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రబ్బి పోటీలకు బిఎన్ కండ్రిగ విద్యార్థి

జాతీయ స్థాయి రబ్బి పోటీలకు ఎంపికైన విద్యార్థి భరత్

ప్రజాశక్తి -బుచ్చినాయుడుకండ్రిగ: బిఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 13వ తేదీ నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాల క్రీడాకారులు భరత్, శీను, యామిని, ముని లక్ష్మి , అనిత, అశ్విని గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. కర్నూల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఆర్ భరత్ పాల్గొని ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి స్థతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చేనెల మహా రాష్ట్ర లోని పూణేలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొన నున్నాడు. ఈ ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యా యులు కె .రమణయ్య , పిఈటిలు కిషోర్ కుమార్, మస్తానయ్య, హరిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు. పేదవారైనా ఈ విద్యార్థులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యా యులు విద్యార్థులను ఎంతో అభివృద్ధిలో నడిపిం చి వారిని జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు తీసుకెళుతున్నందుకు విద్యార్థిని విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. వీధిలో భరత్ తల్లిదండ్రులు లేక తాతయ్య నానమ్మ సహకారంతో మేనమామ రక్షణతో చదువును అభ్యసిస్తున్న విద్యార్థికి పాఠశాల తరపున ప్రభుత్వం తరపున మంచి అవకాశా లు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ నమ్మి మోసపోవద్దు: మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: జగన్ ప్రభుత్వాన్ని మళ్లీ నమ్మి మోసపోవద్దని వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ శనివారం జంగాలపల్లి ప్రజ ల కు పిలుపు నిచ్చారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా జంగా లపల్లి లో మాజీ ఎమ్మెల్యే కి అగ్రహారం ప్రజలు ఘన స్వాగతం పలికి హారతులు పట్టారు. అనంతరం ఆయన ఇంటింటికి తిరిగి భవిష్యత్ గ్యారెంటీపై తెలియజేస్తూ 2024 ఎలక్షన్ లో భావితరాల భవిష్యత్తును ఆలోచించి ఓట్లు వేయాలని మరోసారి వైసీపీని నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పప్పు చంద్రమోహన్ రెడ్డి, జల్లు రమణయ్య చిన్న రెడ్డి, వెంకటా చలం, గురువేంద్ర, మురళి, వీరయ్య, పాపయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: టీడీపీ-జనసేన కూటమికి ప్రజలు ఓట్లేసి గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు పిలుపు నిచ్చారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన తొట్టంబేడు మండలం కాసరం పంచాయతీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో పడుతున్న బాధలు గురించి స్థానికులు వివరించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో గురించి ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళీ నాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి: యుటిఎఫ్

ప్రజాశక్తి - వెంకటగిరి: వెంకటగిరి మండలం యుటిఎఫ్ మండల శాఖ సర్వసభ్య సమావేశం ఆ సంఘం ప్రాంతీయ కార్యా లయం వెంకటగిరి సహ అధ్యక్షులు శ్రీరాములు అధ్యక్ష తన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుతం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి జిల్లా కార్యదర్శి కుమారస్వామి, రాష్ట్ర కౌన్సిలర్ ఉదయ్ కుమార్ సమావేశంలో తెలిపారు. తదనంతరం కార్యదర్శి నివేదిక, ఆర్థిక నివేదిక ఆమోదం, మండల కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కె ఉదయకుమార్ గారు, అధ్యక్షురాలుగా జగదీశ్వరి , సహాధ్యక్షులుగా పి శ్రీరాములు, సహాధ్యక్షురాలుగా వి ప్రసూన, ప్రధాన కార్యదర్శిగా ఆది నారాయణ , కోశా ధికారిగా రమణ య్య ను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా రమేష్, రత్నం, సుధీంద్ర నాథ్, సురేష్ బాబు, వాణిశ్రీ, చినమున స్వామి, వెంకటేశ్వర్లు, శివ, రాంప్రసాద్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా సుబ్రహ్మణ్యం, మల్లికార్జు నయ్య, విజయలక్ష్మి, సోమశేఖర రావు, విజయ లక్ష్మమ్మ, చైతన్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎం కుమార స్వామి, పరిశీలకురాలుగా ఉదయకుమార్, హాజరయ్యారు.

వర్సిటీలు ర్యాంకింగ్ సాధనపై దృష్టి సారించాలి..

ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఆచార్య రామ్మోహన్ రావు

ప్రజాశక్తి -క్యాంపస్: విశ్వవిద్యాలయాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ర్యాంకింగులు సాధించడంలో ఒక ప్రణాళికబద్ధంగా అకడమిక్ అంశాలను, పరిశోధన అంశాలను క్రోడీకరించడం ద్వారా ర్యాంకింగులు సాధించవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఉపాధ్యక్షులు ఆచార్య రామ్మోహన్ రావు అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఐక్యూఏసి సంయుక్త ఆధ్వర్యంలో ఒక్కరోజు కార్యశాల సావేరి అతిథి గృహంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు బోధన, పరిశోధన అంశాలపై దృష్టి సారించి ఉన్నతంగా పబ్లికేషన్లు చేయడం ద్వారా మంచి ఉన్నత ర్యాంకులు సాధించవచ్చు అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కొలసజీవులు ఆచార్య ఎన్ రజిని మాట్లాడుతూ ర్యాంకింగ్ యొక్క ముఖ్య అంశాలను గురించి వివరించారు. ఎన్ఐఆర్ఎఫ్ డబ్ల్యూ ఆర్ యు వాటిల్లో మంచి ర్యాంకులు ఏ విధంగా సాధించవచ్చు నో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అన్నా యూనివర్సిటీ క్యూఏసి డైరెక్టర్ ఆచార్య గుణశేఖర్ రాజా, ఉపకులపతి ఆచార్య డి. భారతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణలో పిసిబి డిజైన్, ఫాబ్రికేషన్‌పై వాల్యూ ఆడెడ్ కోర్స్ ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు టెక్నోట్రాన్ సొల్యూషన్స్ నెల్లూరు వారిచే పిసిబి డిజైన్ అండ్ ఫాబ్రికేషన్‌పై ఆరు రోజుల వాల్యూ ఆడెడ్ కోర్స్ ప్రారంభించినట్లు కళాశాల మేనేజింగ్ సెక్రటరీ వై వినయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి టెక్నోట్రాన్ సొల్యూషన్స్ డైరెక్టర్ ఆర్ వికాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్ వికాస్ రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ లో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్ ప్రాముఖ్యత ఆవశ్యకతను, వివిధ రకాల ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్ తయారీ విధానం గురించి వివరించారు. పిసిబి తయారు చేయడానికి కావలసిన హార్డ్‌వేర్ , సాఫ్ట్వేర్ పరికరాల గురించి వివరించారు. పిసిబి డిజైన్ లో వున్న వివిధ దశలను డిజైన్‌ను సాఫ్ట్‌వేర్ లో సిమ్యులేట్ చేయడం, దాన్ని హార్డ్‌వేర్ లో ఫ్యాబ్రికేట్ చేసే విధానాన్ని వివరించారు. అనంతరం ఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పిసిబి) ని ప్రతి చిన్న ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి పెద్ద పరికరాల తయారీలో ఉపయోగి స్తారు. హార్డ్‌వేర్ పరికరాలను అమర్చడానికి వాటికి ఎలక్ట్రికల్ కనెక్షన్స్ ఇవ్వడానికి ఉపయోగిస్తారని తెలిపారు. వివిధ రకాల సింగిల్ డబుల్ సైడేడ్ మల్టీ లేయర్ పిసిబి తయారీ విధానాన్ని వివరించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఆసక్తిగా పాల్గొని రకరకాల సర్క్యూట్ లను డిజైన్ చేసే విధానాలను నేర్చుకోవాలని ఇది విద్యార్థులకు భవిష్యతులో ప్రాజెక్టుల రూపకల్పనలో ఉపయోగపడు తుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వి రవిప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి అవగాహనా సదస్సులు విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించడానికి ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 167 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు రోటరీ క్లబ్ వెస్ట్ నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గుర్తిం పు అవార్డు లు రావడం అభినం ద నీయమని రాబో యే రోజుల్లోనూ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చే యాలని క్లబ్ సీనియర్ మెంబర్ , వైసీపీ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి వెల్లడించారు. గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆడిటో రియంలో రోటరీ క్లబ్ వెస్ట్ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్య్ర మానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ బాంబే టు గోవా క్రూజ్ లో జరిగిన ఈ అవార్డు ఫంక్షన్‌లో వంద శాతం టిఆర్ఎఫ్ కాంట్రి బ్యూషన్ అవార్డు, వంద శాతం మెంబర్షిప్ గ్రోత్ అవార్డు, వంద శాతం రిజిస్ట్రేష న్ అవార్డు మొత్తం తొమ్మిది అవార్డులు రోటరీ వెస్ట్ క్లబ్ కి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. వెస్ట్ క్లబ్ చేసిన సేవలకు గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షులు సెక్రటరీని ఘనంగా సన్మానించి అభినం దించా రు. ఈ కార్యక్రమం లో కోస్టల్ జోన్ అసిస్టెంట్ గవర్నర్ శ్యాంసుందర్ రావు క్లబ్ అధ్యక్షు లు. సనత్ కుమార్ రెడ్డి ,ఆడిటర్ రామ్మోహన్ రావు, సేగు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, సుధాకర్, విజయ భాస్కర్ రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసులు, గిరి బాబు, కోట కృష్ణ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

వంటగది వ్యర్థాల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం వారు పరిశుభ్రత, వంటగది వ్యర్థాల నిర్వహణ పై అవగాహన సదస్సు ను తిరుపతి లోని స్కావెంజర్స్ (యానాది) కాలనీలో నిర్వహించారు. ఈ సదస్సును మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య సుధారాణి శనివారం ప్రారంభించారు. డాక్టర్ జగదీశ్వరి ఈ కార్యక్రమం ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన మహిళా విశ్వ విద్యాలయం సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ తవిత తులసి వంటగది వ్యర్థాల నిర్వహణకు కంపోస్టింగ్ రీసైక్లింగ్ మొదలైన వాటి గురించి వివరించారు. ఈ వ్యర్థాలను యథేచ్ఛగా పడవేయడం వల్ల పర్యావరణ సమస్యలు ఏర్పడతాయన్నారు. ప్రతి ఒక్కరూ వంటగదిని శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో భూదేవి, మునిరత్నం, ఉపాధ్యా యులు జగదీష్, శోభ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని మేళ్లపాక హెచ్ డబ్ల్యు ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి వి. శేఖర్ ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను, విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించి విద్యార్థుల చేత బుక్స్ చదివించారు. ఒక విద్యార్థి సరిగ్గా చదవకపోవడం వలన ఉపాధ్యాయులపై మండిపడ్డారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ

ఫైలు సంఖ్య నెం.388/జి1/2021 తేది:25-11-2023

ముసాయిదా ప్రకటన

ఆంధ్ర రాష్ట్ర మహా నగర ప్రాంతము మరియు పట్టణాభివృద్ధి సంస్థ ప్రాంతము అభివృద్ధి చట్టము, 2016, ఉపచట్టము 15 ప్రకారం ఈ క్రింద తెలిపిన భూవినియోగ మార్పు, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ప్రాంతమునకు ప్ర.ఉ.112, పు.పా.శాఖ తేది: 08.03.2019నను సవరించి ప్రతిపాదించబడమైనది. ఈ ముసాయిదా ప్రకటన వెలువడిన 15 (పదహైదు రోజుల లోపల) ఈ క్రింద తెలిపిన భూ వినియోగ మార్పు వలన, వ్యక్తులు లేదా సంస్థకు అభ్యంతరములు లేదా సలహాలను ఉపాధ్యక్షులు, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ,తిరుపతి - 517501 వారికి వ్రాత పూర్వకముగా తెలిపిన, విషయములను, ముఖ్య కార్యదర్శి పురపాలక పరిపాలనా మరియు పట్టణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర ప్రభుత్వము, సచివాలయము, వెలగపూడి, గుంటూరు వారికి వారి పరిశీలన మరియు తగు చర్యల నిమిత్తము పంపబడునని తెలియజేయడమైనది.

భూ వినియోగ మార్పు ముసాయిదా ప్రకటన

ప్ర.ఉ.సంఖ్య 112, పు.పా.శాఖ తేది: 08.03.2019 నందు బృహత్ ప్రణాళికా యందు తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ భూ వినియోగ ఆమోదము పొందిన ప్లాను నందు వడమాలపేట మండలములోని యస్.వి.పురము గ్రామములోని సర్వేనెం.411/1,2,3 మరియు 428/1,2,3లో 31 ఎకరములు 14 సెంట్లు విస్తీర్ణము నిరుపయోగము, కొండలు, గుట్టము మరియు బీడు భూమిగా వున్న ప్రాంతముగా వున్నది. సదరు స్థలమును నిరుపయోగము, కొండలు, గుట్టలు మరియు బీడు భూమి నుండి మరియు నివాస ఉపయోగమునకు మార్పు చేయుటకు, సవరించిన మాస్టర్ ప్లాన్ యం.యం.పి. సంఖ్య 02/2023 తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, ద్వారా ప్రతిపాదించడమైనది. సదరు ముసాయిదా భూ వినియోగ మార్పు ప్లాను సంఖ్య 02/2023 తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి కార్యాలయములో పనిదినముల వేళలయందు ప్రజలు సందర్శించి పరిశీలించుటకు ఏర్పాటు చేయడమైనది.

భూ వినియోగ మార్పు భూమి హద్దులు, "A,B,C,D-A" & "EFGHIJ-E"

గ్రామ లెక్కదాఖల	సర్వేనెం.411	సర్వేనెం.428
ఉత్తరము	సర్వేనెం.102(పి)	సర్వేనెం.424 మరియు ప్రతిపాదించబడిన రోడ్డు
దక్షిణము	సర్వేనెం.423(పి), 424 మరియు ప్రతిపాదించబడిన రోడ్డు	సర్వేనెం.417(పి)
తూర్పు	సర్వేనెం.102(పి) & 424(పి)	ప్రస్తుతము ఉన్న 60మీ. వెడల్పు (జాతీయ రహదారి 205) తిరుపతి నుండి చెన్నై జాతీయ రహదారి
పడమర	సర్వేనెం.423(పి)	సర్వేనెం.418(పి) మరియు సర్వేనెం.102(పి)

సం/- యస్.హరికృష్ణ, యం.ఏ, యం.ఫిల్,
ఉపాధ్యక్షులు, తుడా, తిరుపతి